

అవుడ నాకి ఏడేండ్లో ఎనిమిదేండ్లో ఉంటాయి.

అదిగో పరంగోడొచ్చె ... అడిగో పరంగోడెచ్చె ... అని ఎవరన్న అరిస్తే సాలు, ఆడే ఆట్లన్నీ మద్యలోనే ఇడిసిపెట్టి గుడుసుల్లోనో వాముల్లోనో దూరి దాపెట్టుకొంటా ఉంటిమి నేను, నా జతగాళ్లు.

'లటుకు పటుకు, లటుకు పటుకు' అని శబ్దం సేసుకొంట గుర్రాలన్నీ ఎల్లిపొయ్యినంక మెల్లగ రోడ్లోకి పొయ్యి అవ్వి యెంత దూరం అడుగులేసి ఎగిరిండివో కొలుసుకొంటా ఉంటిమే గాని, ఆ గుర్రాలు యంతెత్తు యంత పొడువు వుండివో పరంగోడు యట్లుంటాడో మాత్రం సూసిండ్లేదు.

ఒగదినము మద్యాన్నం కాలువతట్టుకు పొయ్యి కూకోనుండాను. 'అడిగో పరంగోడు' అని అరుసుకొంట పిల్లోల్లంతా గద్దని సూసిన కోడిపిల్లల మాదిరి పారిపొయ్యిరి కాని నేను లేసే తవడనిక్కాదు. తొందరిచ్చుకోని నేలకి పడిపోతి. అంతలోనే మట్టువడువు కాళ్లు తగిలిచ్చుకోని, నల్ల మేగాలు ఎగిరొచ్చినట్ల నోట్లో తెల్ల నురగ కారిచ్చుకొంట గుర్రాలు ఎగురుకొంట వొచ్చె.

కండ్లకడ్డం పడిండే సింపిరి యుంటికెలు రెండు సేతుల్తోనా పక్కకి జరిపి సూస్తిని గదా రెండు గుర్రాల మింద యర్రమూతుల కోతుల మాదిరి ఉండే ఇద్దరు బుస్సుకోట్లు ఏసుకోని కూకోనుండారు. పిల్లికండ్లు, కమిలిపొయ్యిండే కందిరీగ రెక్కల మాదిరి గడ్డం మీసాలు, తలకాయమింద గిన్ని మాదిరి ఉండే టోపీ బోర్లిచ్చుకోని గడ్డం కింద గంటేసుకోనుండారు. యర్రగ ఉండే బూడుసులేసుకోని, పిక్కండ్ల వొరుకు కాకీ బట్ట సుట్టుకోని యమకింకరుల మాదిరి ఉండే వాళ్లని సూస్తానే నాకి పై పానాలు పైనే పొయ్యినట్లాయ.

నన్ను సూసి మిలిట్రీలోకి యాడవట్టుకోతారో కదరా బగమంతుడా అని అనుకొంట మాకాలిసిప్ప పగిలి మంట పెడతా ఉన్నా కూడా బిగబట్టుకోని గబ్బుసెట్టుకింద పూరిడి గువ్వమాదిరి దాపెట్లుకొంటి రవంతసేపు. గుర్రాలమింద పరంగోళ్లు ముందరకెళ్లిపొయ్యిరి.

నేనింటికి పొయ్యే టయానికి మా తాత కపిలతోలొచ్చి ఎద్దులకి అగిశాకు తినిపిస్తా ఉండె. మెల్లగ తాత పక్కలో కూకోని, "తాతా! తాతా! పరంగోడంటే ఎవురు?" అని అడిగితి. దానికి తాత "పరంగోడంటే ఇంగిలీసోడు. బప్పాయి కాయలు బాగా మాగితే ఎర్రగ అయితాయి. ఆ బప్పాయి కాయల్ని రాయలసీమ జనాలు పరంగికాయలంటారు. ఆ కాయలమాదిరి ఉండారు కాబట్టే తెల్లోళ్లని పరంగోళ్లు అంటారు!" అని సెప్పె.

"అయితే తాతా, ఈ పరంగోళ్లకి మన దేశంలో ఏం పని?" అని అడిగితి.

"వాళ్లకి పనేమీ లేదురా! యాపొద్దో ఎల్లిపోతా ఉండ్రి. వాళ్లుంటే మనూర్లో ఉండే కరణం సుబ్రావు, రెడ్డిరికం జేసే సుంకిరెడ్డి ... ఇట్లా ఒళ్లకి శానా బాగుంటుంది ... వాళ్ల పేరు జెప్పుకోని దేశాన్ని ముంచుతా వుండారు!" అనె.

అంతలోనె గంటు మూట మోసుకోని కమ్మిడి భుజంమీద ఏసుకోని పరదేశప్ప ఒచ్చె. "ఏంరా పరదేశీ! ఈసారి ఇంత బిరీన ఒస్తివి?" అనె మా తాత.

దానికి పరదేశి "ఏం జేస్తాం, తాతా, ఈ యాడాది యనకవానలు పనిచ్చె. గడ్డి లేక గొర్లన్నీ కండ్లతో సూసేకి కాకుండ ఎండుకుపోతా వుండివి. అందుకే ఈసారి ఒగు నెల ముందుగానే ఒస్తిమి!" అనె.

"రాకపోతే అవుతుందేముప్పా! మనుసులకు తిండి లేకుంటే యాడన్నా

# పరదేశి • సడ్లపల్లె చిదంబరరెడ్డి

అడుక్కోని తినొచ్చు. సన్నజీవాలకి గడ్డి లేకపోతే దానంత నరకం ఇంగొగటి ఉండెల్లేదు!" అని తాత అంగలార్సి గుడిసెలో ఉండే మా యవ్వని పిలిచె.

జొన్నగింజలు శాట్లోకేసుకొని రాళ్లేర్తా ఉండే మా యవ్వ బయటకొచ్చి "ఏం పరదేశీ, అవుడే యింతెత్తయ్యిండావప్పా!" అని మాట్లాడిచ్చి సమాశారాలు తెలుసుకోని తాత యాల పిల్సిండాడో అర్థం సేసుకోని సెంబుతో నీళ్లిచ్చె.

పరదేశవ్వ నాకంటె ఐదారేండ్లు పెద్దోడు. మోసుకోనొచ్చిన మూట ముల్లె పలకల మంచంమింద దించి సేతులు, కాళ్లు, ముకము కడుక్కొనొచ్చె.

అంతసేపటికి మా యువ్వ జొన్న రొట్టెలు కాల్సి, కొత్త దుత్తలో శక్కిరి తేరిండే బెల్లం పాకం ఏసి తినమంటాని తెచ్చిచ్చె.

అందరూ తినుకొంట ఆ మాట ఈ మాట మాట్లాడుకొంట ఉంటె, తాత "ఏమప్పా పరదేశీ! గొర్రెలు కాలుక్కాలు పెరిగిండినో కరవుకాలమంటాని ముక్కేమన్నా పెట్టిండారో?" అని అడిగె.

"లేదు, పెద్దయ్యా! ఈసారి యాబై గొర్రి ఎక్కువే అయ్యింది!" అని సెప్పుతా ఉండే పరదేశిని గబుక్కున సూస్తే పరంగోడే అనిపిస్తాడు. అదీగాక మా తాత ఒకసారి పరదేశవ్వ కతంత సెప్పిండె ...

000

శానా ఏండ్ల ముందర ఇందూపురం తాన మిలిట్రీ వోళ్లు కాంపులేసి ఐదారేండ్లు ఆడే వుండ్రంట. వాళ్ల టెంటుల్లో పనిజేసేదానికి సుట్టుపక్క ఊర్లనుంచి బీదా బిక్కీ జనం ఒచ్చిపోతావుండ్రంట.

ఇంగ రేపో మన్నాడో మిలిట్రీ వోళ్లు ఎల్లిపోతారు అనంగా ఆ పక్కలో ఉండే వంకలో మిట్టమద్యాన్నమపుడు అవుడవుడే పుట్టిండే సన్నపిల్లోడు గుక్కతిప్పుకోకుండ ఏడుస్తా ఉన్నంట. గొర్లు మేపుతా ఉండే గొర్ల తిమ్మన్న ఆ పిల్లోన్ని జూసి...

"యింత పాపిష్టోల్లయితే బంగారట్లా బిడ్డని కని వంకల్లో పారేసి పోతారు, ఈల్ల బతుకు పాడుగాను!" అని తిట్టుకోని, పిల్లోన్ని పువుమాదిరి ఎత్తుకోని, కడుపునిండ గొర్లపాలు తాగిచ్చి రాతిరి మందతాకి తీసుకోనొచ్చెనంట.

'తాను దూరేకి సందు లేదు మెడకో డోలు' అంటాని ఆయప్పని సూసి మిగతా గొర్లమందలోల్లంతా పడి పడి నగిరంట.

యాలంటె తిమ్మన్నది మా ఊరు కాదు. దర్మారము తాన ఒగుపల్లె ఆ యప్పది. సెంటు బూమీ లేదు. తాత్ల ముత్తాతల కాలం నుండి గొర్రెలు మేపుకోని పొట్టేళ్లు, గొర్రిబొచ్చు అమ్ముకోని పెండ్లాము బిడ్డల్ని సాకల్లంట.

దాని జతకి యండకాలమొస్తే సాలు ఆ ఊర్ల తట్టు గొర్రెలకి ఒగుకసువుపాసు లేకుండ ఎండుకోని పోతుందంట. తిరిగ వానల కాలమొచ్చి గరకపాసులు మొలిసే ఒరుకు మా ఇందూపురం తట్టొచ్చి సెరువుల్లోన, కుంటల్లోన ఉండే జావిమానులు కొనుక్కోని, కంపలు, జావికాయలు మేపుకోని రైతుల సేనుల్లో మందలేసుకోని బతకల్లంట.

అట్లా గొర్ల తిమ్మన్నకి ఎవురో కని పారేసిండే బిడ్డ కత యాల? ... అని అందరూ నగిరంట.

ఎవరెట్ల నగినా గొర్ల తిమ్మన్న పట్టించుకోలేదంట. గొర్ల పాలు తాపుకొంట పిల్లోన్ని పెంచినంట.

పిల్లోడు పెరిగి పెద్దగయితా వుంటే ఒగసారి తిమ్మన్న మా తాతని అడిగినంట "పిల్లోనికి ఏం పేరు పెడదామన్నా?" అని.

దానికి మా తాత "బూమ్మీద కండ్లు తెరుస్తా వుండే మనిషికి మనం పేరు బెట్టే యవ్వారం మంచిది గాదు. మనిషై పుట్నోడు జనాల మద్య పెరగల్ల. వాడు సేసే పనుల్జూసి వాని బుద్ధిని జూసి జనాలే వానికి ఒగ పేరు బెడతారు. అదే మనిషికి అసలైన పేరు!" అన్నంట.

అందుకే ఆ యప్పకి పేరు బెట్లేదు.

మిలిట్రీ వోళ్ల టెంటు తాన సిక్కిండేది తెలిసినోళ్లు ఆ యప్పని పరదేశి అని పిలుస్తారు. ఆ యప్ప ఆకారం మాతరమే గమనించే వోళ్లు యర్రోడు అంటారు. ఆ యప్ప జతలో గొర్లు మేపేవోళ్లు మాత్రం ఆ యప్పని అగ్గోడు అని పిలుస్తారు.

ఆ యప్ప నిజంగా అగ్గట్లావోడే! ఒగ అబద్దం సెప్పేది తెలీదు. పనికి తప్పించుకునేది తెలీదు. వేరే వోళ్ల సొమ్ము ముట్టుకొనేది తెలీదు. మూగ జీవాలని కండ్లల్లో వత్తులేసుకోని కాపాడేది మాత్రం తెలుసునంట.

ఒగసారి ఏటిగడ్డలో ఐదారు గొర్రెల మందలు ఏసిండారంట. కండ్లు సించుకొన్నా కనబడకున్నంత అమాస మబ్బుంట. బీడీలు తెస్తానని జెప్పి ఒగడు, కాపీ పొడి తెస్తానని జెప్పి ఒగడు, పకోడీలు తెస్తానంటాని ఒగడు పరదేశికి గొరలమందిడిసిపెట్టి మెల్లగ సినిమా సూసేకి జారుకోనుండారంట.

ఒగపొద్దుకు దొంగలొచ్చి మందలన్నీ సుట్ట తిరిగినా నరమానవుడు లేడంట. ఇంకేముంది బాగా బలిసిండే గొడ్లు గొర్రెలు కాళ్లుగట్టి మెడమీద మోసుకోని అంత దూరము పొయ్యిరంట.

అవుడు పడినంట సూడన్న 'బెరో' అంట రాళ్లు! ముంగార్లో వడగండ్లు పడినట్ల తపాతపా దొంగలమిందికి రాళ్లు పడతా ఉంటె బుర్రలు వ గిలిచ్చుకోని, రగతం కారిచ్చుకోని ఎత్తుకోనుండే గొర్రెలాడ పారేసి దిక్కు కొగడు ఉరికిరంట.

నడుముకు రాళ్ల సంచి కట్టుకోని, సింతసెట్టు కొనకొమ్మల మింద నిలుసుకోని పడిసెల్లో



## ఐశ్కంత మంచి పేరెందుకు?

పాత, కొత్తనటులందరికీ ఐశ్వర్యారాయ్‌తో కలిసి పనిచేయాలని వుంటుంది. ఆమె విశ్వసుందరి కావడం వల్లేనేమో అనుకుంటే పప్పులో కాలేసినట్లే! ఐశ్వర్య తనతో కలిసి పనిచేసే వాళ్లందరితోటీ చాలా మృదువుగా, చక్కగా వ్యవహరించడమేనని చెప్పుకుంటారు. నమ్మకం కలక్కపోతే 'ధాయీ అక్షర్ ప్యార్ కే' చిత్రం హీరో అభిషేక్‌బచ్చన్‌ను అడగండి. రాకేశ్‌రోషన్ కూడా ఐశ్వర్యను పొగుడుతాడు కానీ, తన కొడుకు హృతిక్‌రోషన్‌తో పని చేయించేందుకు మాత్రం ఎందుకో సుముఖంగా లేడు. ఎందుకని ఆయన్నే అడిగితే అంటున్నాడుకదా-"హృతిక్ ఇంకా కొత్తకొత్త నటీమణులతో చేయాల్సివుంది. పైగా ఐశ్వర్యకు టీన్‌ఏజ్ ఇమేజ్ లేదు కదా! హృతిక్‌తో చేస్తే చాలా మెచ్యూర్డ్ నటిగా కనిపిస్తుంది" అని. కానీ దక్షిణాదిలో తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ మాత్రం ఐశ్వర్యతో కలిసి నటించేందుకు తానే డబ్బుపెట్టి చిత్రం తీసేందుకు సిద్ధపడటమే కాక, చివరికి నిర్మాతగా కూడా అవతారమెత్తబోతున్నారట. పాపం, సల్మాన్‌ఖాన్‌కు మరో ప్రత్యర్థి తయారవుతున్నాడని కొందరు ఆనందిస్తున్నారు!

ఎస్.

రాళ్లుపెట్టి పరదేశి బాలశందురుని మాదిరి రేగిపొయినంట.

గొర్లు కాసే వోళ్లు ఇద్దరు ముగ్గురు ఒగతాన కలిస్తే సాలు, పరదేసి తోడేళ్లని ఎట్ల సంపింది, గొఱ్ఱిపిల్లని సుట్టుకోని మింగుతా ఉండే దాసరిపామును యట్ల నరికింది కతలమాఁద్రి సెప్పుకొంటా ఉంటారు.

యండకాలమొస్తే సాలు, పరదేశి గంటు మూట మోసుకోని ముందుగానే రైల్లో ఒస్తాడు. గొఱ్ఱెలు తోల్కోని తిమ్మన్న వాని యనకే ఒస్తాడు.

మా ఇంటి ముందుర వసారాలో సంగటి శార సేసుకోని, మంచికి సెడ్డకి మా తాత కొండయ్య సెప్పినట్లు నడుసుకోని ఒగూరు కాకపొయ్యినా, ఒగ కులం కాకపొయియనా ఒగే గుణంతో బతుకుతారంటాని ఊరంతా అనుకొంటా ఉంటారు.

000

గొర్లొచ్చి అపుడే మూడ్నెల్లయిపొయ. ఈసారి నేను గూడ పరదేశి యంట పుట్టిన గొఱ్ఱిపిల్లలు మోసుకొంట తిరుగుతా ఉండాను.

ఒగదినము బాట పక్కలో గొర్లు మేపుతా ఉంటే రెడ్డీ కర్నం పంపించ్చిండారని జెప్పి ఇద్దరు మనుషులొచ్చిరి. ఒగడు రెడ్డికి బావమరిది, ఇంగోడు కరణం ఇంట్లో సేద్దిం సేసేవోడు. వాళ్లని జూస్తే మా ఊర్లో అందిరికీ బయమే. వాళ్ల ఏటుకి ఎదురుండేల్లేదంట. వాళ్ల సేతుల్లో పోలీసోల్లుంటారంట. వాళ్లేమి జేస్తే అదే సట్టమంట.

వొచ్చినోళ్లు వొచ్చినట్లే పొట్టేళ్లు యనక్కాళ్లు పట్టుకోని మందలోనుంచి బయటికీడ్సిరి.

"ఎవురన్నా మీరు? గొఱ్ఱిల్నియాల అట్లు పట్టుకుపోతా వుండారు?" అని అగ్గాయవ్వ అడిగె.

"మేమెవురైతే నీకేంరా? పరంగోనికి రాత్రికి పార్టీ ఇయ్యాలంట. పోలీసోల్లు సెప్పిండారు!" అని దబాయిచ్చిరి.

"పోలీసోడైతే ఏమి, వాని తాత పరంగోడైతే ఏమి? కష్టపడి కన్నబిడ్డ మాదిరి పెంచిండే గొర్లు నేనేమిటి కిస్తాను?" అని అగ్గాయవ్వ అడ్డం పొయ.

"మా ఊరికొచ్చి మాకే అడ్డం సెప్పేదానికి నువ్వు యా వూరి దాసరోడురా?" అనె ఒగడు మీసాలు మెలేసుకొంట.

అంతే! అగ్గాయవ్వ అగ్గయిపొయ! సెతిలో ఉండే ఎదురు బఱ్ఱ తీసుకోని రెడ్డిగాని బావమరిదిని ఈవుమింద ఒగటంటించ్చె.

"అయ్యో! సస్తిరా, నా కొడకా!" అని జెప్పి వాడు పట్టుకోనుండె గొఱ్ఱిడిసిపెడ్తా ఉన్నట్లి కర్నం మనిషి జుట్టు వంగబట్టుకొనె. అంతలొ పోలీసు జీప ు బఱ్ఱంట వొచ్చి ఆ తవ్వ నిలిసె.

జీపులో నుంచి మూరడు పొడువు యఱ్ఱ టోపీలు పెట్టుకోనుండే పోలీసోల్లు దిగి సోటా కట్టెల్తో అగ్గాయవ్వని వాంచబట్రి. నాకు కడుపు మండిపొయ. బయంతో నోరు ఆరుకుపొయ. మెల్లగ గొర్ల కింద దూరి దాపెట్టుకుంటి.

ఏం సెయుల్లో తెలీని పరదేశి గొడ్డు మాదిరి రవంతసేపు ఏట్లు తిని గబుక్కున నడుముకు కట్టుకోనుండే వడిసిలి తీసి సిక్కంలో ఉండే రాళ్లు పెట్టి శఁక్రం మాదిరి తిప్పబట్టె.

వడిశిల్లో నుండి రాళ్లు తుపాకీ తూటాల మాదిరి పరదేశి ఇడుస్తా ఉంటే జీపునిడిసిపెట్టి పోలీసోళ్లు వాళ్ల యనకల్నే రెడ్డీ, కర్నం మనుషులు కుక్కల మాదిరి దిక్కుల కొగుడు పారిపొయ్యిరి. అయినా గూడా అగ్గాయవ్వ కోపం సల్లార్లేదు. జీపునంత పగులగొట్టేసె. అగ్గిపుల్ల గీసి అంటిచ్చిపారేసె.

గొర్లన్ని మేత మేసేది ఇడిసిపెట్టి నిలబడిపొయ. పిల్లలన్ని తోకలాడిచ్చుకొంట పాలు తాగుతా ఉండిపొయ. గంటసేపు నా నోట్లో మాట బయటికి రాలేదు.

మెల్లగ గొర్ల మరుగునుండి దగ్గరకొచ్చి, "కాదు, పరదేశి పెద్దోళ్లమింద, అధికారముండేవోళ్లమింద అట్ల తిరగబడితే యట్లప్పా?" అని అంటి.

"మంచి అనేది పెద్దది. సెడ్డ అనేది సిన్నది. ఈ పొద్దింట్లో ఉంటాము, రేపు తుంట్లోకి పోతాము. అంతేగానీ బెదిరిచ్చేవోళ్లకంత బయపడుకొంట సావు బతుకు ఏమిటికి బతకల్ల?" అని అంటావుండే పరదేశి అగ్గాయవ్వ మాదిరి కాకుండ ఆకాశంలో సుక్క మాదిరి నా కగుపిచ్చె.

000

ఆ పొద్దు రాత్రి ఊర్లో అంతా గుంపులు గుంపులు సేరి మాట్లాడుకొంటా వుండారు గానీ, ఏమ్మాట్లాడ్తా వుండారో నాకైతే తెల్లేదు. పోలీసోల్లని కొట్టిన పరదేశికి మందతాన నిఁద్రొచ్చిందో, లేదో అని అనుకొంట కమ్మిడిమింద పొర్లుకొంట యపుడు నిఁద్ర పొయ్యిండానో నాకే తెలీదు.

నేను నిద్దర లేసేకంటే ముందే తెల్లారిపొయ్యింది. ఊర్లో అంతా పండగ జేస్తా వుండారు. జెండా లెగరేస్తా వుండారు. అది సొతంఁత్రం పండగంట. పరంగోడు మన దేశాన్ని మనకిడిసిపెట్టి ఆ పొద్దురాఁత్రే ఎల్లిపొయనంట!! ఇంగ మనం బాగా బతకొచ్చనంట ... జనాలకి కష్టాలు తీరిపొయనంట ... అందరూ ఎఁర్రి ఆనందం పడిపోతా వుండారు.

ఇది తెలిసి పరదేశి ఏమంటాడో సూడల్ల అనిపిచ్చి గొర్లమంద తాకి పోదామంటాని యల్బార్తే గొర్లన్నీ మా ఇంటిముందరే ఉండివి. పిల్లలు పాలు తాగినట్ల లేదు. బేర్ బేర్ అంటా అరుస్తావుండివి. గొర్ల తిమ్మన్న ముఖంమింద బట్టేసుకోని ఏడుస్తా వుండాడు.

యాలంటే పరదేశి లేడంట. వాడు మనదేశమోడు కాదంట. మన దేశంలో కుఁట్ర సేసేకి వచ్చిండే పరదేశమోడంట. అందుకే పోలీసోళ్లు రాతిరొచ్చి బేడీలేసి పట్టుకుపొయ్యిరంట. ఉరిశిచ్చ ఏస్తారంట. అందరూ అనుకొంటా వుండే మాట్లింటావుంటే నా కాళ్లకింద బూమి అదిరినట్లాయ. కంట్లోకి సూలాలు దింపినట్లాయ. శవం మాదిరి నడుసుకొంట పెద్ద సందు వరకు వొస్తి. రెడ్డిగారి బావమరిదిని, కరణం మనుషుల్ని పూలారాలేసి గుఁఱ్ఱాల మింద మెరవణి జేస్తా వుండారు. దేశానికి సొతంఁత్రం కావల్ల అన్జెప్పి గవర్నమెంటు మింద ఆయప్పగారు ఎదురు తిరిగి జీపుని పగలగొట్టి కాల్చేసిందానికి బోమానాలిస్తా వుండారు. వాళ్లే సొతంఁత్రం యోదులంట ... ఎల చ్చన్లొస్తే మనకి మంఁత్రులు గూడా వాళ్లేనంట ...!

అందరూ మాటాడేది ఇనుకొంట పండగ సేసేది సూసుకొంట కబోది మాదిరి నిలబడిపోతిని గాని ఊపిరి ఇడ్లేదు. యాలంటే మా తాత నన్ను గుడ్డోడా అని పిలుస్తా వుంటాడు. ■

